క్లుప్తంగా

ఇనార్బిట్‌లో కొత్త డిజైనర్ కలెక్షన్స్..

సాక్షి, సిటీబ్యూరో: మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ సరికొత్త డిజైనర్ కలెక్షన్స్‌ను నగరానికి తీసుకువచ్చింది. దేశవ్యాప్తంగా పేరొందిన ప్రముఖ డిజైనర్లు శంతను నిఖిల్‌కి చెందిన ఎస్ అండ్ ఎన్, నికోబార్, గాంట్, ట్రూ రెలిజియన్, మెలిస్సా తదితర బ్రాండ్స్‌ను అందుబాటులోకి తెచ్చామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. విభిన్న రకాల కొత్త కొత్త ఆకర్షణలతో వేడుకలు నవంబరు 12 వరకూ కొనసాగుతాయని వివరించారు.

27న నిధి ఆప్ కే నిఖత్

పటాన్‌చెరు టౌన్: భవిష్యనిధి సంస్థ ద్వారా ప్రతినెల సమస్యల పరిష్కారానికి ఫిర్యాదుల్లో భాగంగా నిధి ఆప్ కే నిఖత్ 2.0ను ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ప్రాంతీయ కమిషనర్ విశాల్ అగర్వాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.మూడు కేంద్రాల్లో మూడు శిబిరాలను ఉదయం 9:30 నుండి 5:45 గంటల వరకు నిర్వహిస్తామన్నారు.సంగారెడ్డి జిల్లాలో బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్ విద్యాభారతి హైస్కూల్, పటాన్‌చెరు మండలం పాశమైలారం ఐటిడబ్ల్యూ ఇండియా లిమిటెడ్, రుద్రారం ఎంఎస్ఎన్ లాబరేటరీలో శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సమస్యలు ఉన్నవారు పైన పేర్కొన్న మూడు కేంద్రాల్లో తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

జిలానీ అహ్మద్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థికి బుధవారం పీహెచ్‌డీ ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ పరిశోధక విద్యార్థి జిలానీ అహ్మద్ ఆ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ముఖీమ్ అహ్మద్ పర్యవేక్షణలో 'మెషిన్ లెర్నింగ్ అండ్ సెమాంటిక్ వెబ్ టెక్నాలజీతో వార్తా కథనాల అగ్రిగేషన్' అనే అంశంపై థీసిస్ సమర్పించారు.

అమ్మవారి సేవలో గాంధీ

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే గాంధీ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ నాయకులు గౌతమ్ గౌడ్, వాసిలి చంద్రశేఖర్ ప్రసాద్, ఉరిటి వెంకట్రావు, ప్రవీణ్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 17 మందికి జరిమాన విధించిందని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. సోమ, మంగళవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 17మందిని పట్టుబడగా వారిని బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 15 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల జరిమాన, ఒకరికి రూ. 3వేలు, మరొకరికి రూ.5 వేలు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

దుర్గం చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య

మాదాపూర్: తండ్రితో గొడవపడి కుమారుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎస్. తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. గాజులరామారంలో నివాసముంటున్న సంపత్‌రావు (45) క్యాబ్ డ్రైవర్. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈనెల 24వ తేదీ సంపత్‌రావుకు తండ్రికి క్యాబ్ విషయమై గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెంది 25వ తేదీన ఉదయం మాదాపూర్‌లోని దుర్గం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సంపత్ క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కంపెనీలో గత కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా శ్రీవారి చక్రస్నానం



శ్రీవారి ఉత్సవమూర్తులకు చక్రస్నానం నిర్వహిస్తున్న పండితులు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి నవాహ్నిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. వేడుకల్లో భాగంగా బుధవారం ఉదయం విభిన్న ద్రవ్యాలతో స్వామివారి చక్రస్నాన వేడుకలు, పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. సాయంత్రం స్వామివారిని అశ్వవాహనంపై ఊరేగించారు. ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు పాల్గొన్నారు.



కాంగి 'రేసు'.. కమలంలో పోటీ

- జాతీయ పార్టీల జాప్యం
- తేలని అభ్యర్థుల ఎంపిక.. తీవ్ర ఉత్కంఠ
- కార్యకర్తల ఎదురుచూపులు
- మొదటి లిస్ట్‌లో దక్కని చోటు
- ఢిల్లీ కేంద్రంగా ప్రయత్నాలు



బీజేపీ: రవికుమార్ యాదవ్



బీజేపీ గజ్జెల యోగానంద్



కాంగ్రెస్: రఘునాథ్ యాదవ్



కాంగ్రెస్: జగదీశ్వర్‌గౌడ్

గచ్చిబౌలి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ రెండు జాతీయ పార్టీలే. శేరిలింగంపల్లి నియోజకవర్గం అభ్యర్థుల ఎంపికలో రెండు పార్టీలు మల్లగుల్లాలు పడుతున్నాయి. దీంతో పార్టీ అభ్యర్థులు ఎవరో తేలకపోవడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. నియోజకవర్గంలో ఆ రెండు పార్టీలలో రెండు వర్గాలు మాకే టికెట్ దక్కుతుందనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇక బీఆర్ఎస్ ఎన్నికల షెడ్యూల్ రాకముందే అభ్యర్థులను ప్రకటించి ఎన్నికల కార్యాచరణలో ముందుంది. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల పేర్లు మొదటి లిస్ట్‌లో రాకపోవడం, రెండో లిస్ట్ జాప్యం కావడంతో అభ్యర్థి ఎవరంటూ కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు.

బీజేపీ అభ్యర్థి ఎవరో?

శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గత ఎన్నికలలో బరిలో నిలిచిన గజ్జెల యోగానంద్, రెండున్నర ఏళ్ల క్రితం కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరిన ఎం.రవికుమార్ యాదవ్ బీజేపీ టికెట్ కోసం పోటీ పడుతున్నారు. వీరే కాకుండా బీజేపీ సీనియర్ నాయకులు మొవ్వా సత్యనారాయణ, డా.నరేష్ తదితరులు టికెట్ ఆశిస్తున్నారు. టికెట్ రేసులో రవికుమార్ యాదవ్, గజ్జెల యోగానంద్ మాత్రం ఉన్నట్లు పార్టీలో చర్చ జరుగుతోంది. ఆ ఇద్దరు నేతలు ఢిల్లీ కేంద్రంగా టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మొదటి లిస్ట్‌లో ఎవరి పేరు రాకపోవడంతో క్యాడర్‌లో కొంత నిరుత్సాహం నెలకొందనే చెప్పాలి. రెండో లిస్ట్‌లో తమ నేతల పేర్లు ఉంటాయని ఆశిస్తున్నప్పటికీ లిస్ట్ జాప్యం కావడంతో ఆందోళన నెలకొంది. బీజేపీ అధిష్టానం జనసేన పార్టీతో పొత్తుకు దిగడంతో టికెట్ రేసులో ఉన్న వారు ఆందోళన చెందుతున్నారు. శేరిలింగంపల్లి టికెట్‌ను జనసేన కోరుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. పొత్తులో స్పష్టత వస్తే శేరిలింగంపల్లి బీజేపీకి దక్కుతుందా లేక జనసేనకు దక్కుతుందా తేలాల్సి ఉంది. జనసేనకు టికెట్ కేటాయిస్తే బీజేపీ నాయకుల వలసల పరంపర కొనసాగే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

కాంగ్రెస్ టికెట్ ఎవరిని వరించేనో?

శేరిలింగంపల్లి కాంగ్రెస్ టికెట్ విషయం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పెద్ద నియోజకవర్గం కావడం, రాష్ట్రంలో కాంగ్రెస్ గ్రాఫ్ పెరిగిందని సర్వేలు వెల్లడించడంతో టికెట్ ఎవరికి వస్తుందోనని చర్చ సాగుతోంది. కాంగ్రెస్ రాష్ట్ర కోశాధికారిగా ఉన్న మారబోయిన రఘునాథ్ యాదవ్, జీహెచ్ఎంసీ ఫ్లోర్‌లీడర్‌గా ఉన్న కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ టికెట్ ఆశిస్తున్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వర్గంలో ఉన్న రఘునాథ్ యాదవ్‌కు దాదాపు టికెట్ ఖరారైనట్లు ప్రచారం జరిగింది. ఇటీవల తన సతీమణితో కాంగ్రెస్‌లో జగదీశ్వర్ గౌడ్ చేరడంతో సీన్ రివర్స్ అయినట్లుగా పేర్కొంటున్నారు. ఢిల్లీ కేంద్రంగా ఇటు రఘునాథ్ యాదవ్, అటు జగదీశ్వర్‌గౌడ్‌లు టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇద్దరి మధ్య పోటీ తీవ్రంగా ఉండటంతో అధిష్టానం మొదటి లిస్ట్‌లో ఎవరి పేరు ప్రకటించలేదు. తదుపరి జాబితాలో ఎవరి పేరు ప్రకటించినా మరొకరు ఏ నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

జంగ్ 2023 తెలంగాణ

బీఆర్ఎస్ అసమ్మతి సమసినట్లేనా!



ఇటీవల కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు (ఫైల్)

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి బీఆర్ఎస్‌లో నెలకొన్న అసమ్మతి సమసినట్లేనని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు ఏకతాటిపైకి వచ్చి టీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ గెలుపు కోసం కృషి చేస్తారని ఆ పార్టీ నాయకులు పేర్కొంటున్నారు. ఇటీవల ఇద్దరు కార్పొరేటర్లు జగదీశ్వర్ గౌడ్, పూజిత కారు దిగి హస్తం గూటికి చేరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మరో ఇద్దరు కార్పొరేటర్లు ఎమ్మెల్యే గాంధీ పట్ల సానుకూలంగా లేరని, వారు కూడా పార్టీ మారతారనే ప్రచారం జరిగింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శేరిలింగంపల్లి నియోజకవర్గంపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. ఎట్టి పరిస్థితుల్లోను పార్టీ అభ్యర్థి గాంధీ గెలుపు కోసం సమష్టిగా పని చేయాలని పార్టీ క్యాడర్‌కు ఆదేశాలు జారీ చేశారు. అసంతృప్తులతో నేరుగా ఫోన్‌లో కేటీఆర్ మాట్లాడినట్లు తెలిసింది. అంతే కాకుండా గత వారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు, డివిజన్ల ముఖ్య నాయకులతో నేరుగా సమావేశమయ్యారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి మంచి గుర్తింపు ఉంటుందని దిశా నిర్దేశం చేశారు. మాదాపూర్, హఫీజ్‌పేట్ కార్పొరేటర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో సెకండ్ క్యాడర్ నాయకులకు డివిజన్ బాధ్యతలు అప్పగించారు. ఆ రెండు డివిజన్లపై ఎమ్మెల్యే గాంధీ ఫోకస్ పెట్టాలని ఆదేశించారు. ఈ క్రమంలోనే మాదాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్లలో ఆత్మీయ సమ్మేళనాలతో గాంధీ బిజీగా ఉన్నారు. డివిజన్లలో చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తున్నారు. ముఖ్య నాయకులను నేరుగా కలిసి ఎవరు పార్టీ వీడవద్దని, నేను న్నానని భరోసా ఇస్తున్నారు. గచ్చిబౌలి డివిజన్‌లో కంటెస్టెడ్ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా పార్టీ కోసం పూర్తి స్థాయిలో పని చేసే వెసులుబాటు కల్పించారు. మిగిలిన డివిజన్లలో కార్పొరేటర్లు ప్రచారం చేయాలని సూచించినట్లు సమాచారం. అందరు సమన్వయంతో పని చేయాలని కేటీఆర్ సూచించారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన నాయకులు రవికుమార్ యాదవ్

బీజేపీలో చేరికలు

గచ్చిబౌలి: తెలంగాణలో కాషాయ జెండా ఎగురవేసేందుకు కృషి చేస్తున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవి కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం మసీద్‌బండలోని పార్టీ కార్యాలయంలో పలువురు యువకులకు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత పెద్ద సంఖ్యలో బీజేపీలో చేరుతుందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు రమేష్ ఆధ్వర్యంలో సంతోష్ ముదిరాజ్, వసంత్, శ్రీను, రాఘవేంద్ర, అజయ్, మురళి, అరవింద్, మోహన్, నాగరాజు, మహేష్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

తెలుగు వంటకాలంటే ఇష్టం

- గచ్చిబౌలిలో అంతేరా రెస్టారెంట్‌ను ప్రారంభించిన నిఖిల్

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుతం తెలుగు సినిమాల పరంగా స్వర్ణయుగం తలపిస్తుంది, ఇలాంటి తరుణంలో వినూత్న కథాంశాలతో ప్రేక్షకులను అలరించే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని ప్రముఖ టాలీవుడ్ హీరో నిఖిల్ సిద్ధార్థ తెలిపారు. బుధవారం గచ్చిబౌలి వేదికగా ఏర్పాటు చేసిన 'అంతేరా' కిచెన్-బార్ రెస్టారెంట్ 2వ బ్రాంచ్ ప్రారంభోత్సవంలో నిఖిల్ సిద్ధార్థ పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తెలుగు వంటకాలంటే అమితంగా ఇష్టపడతానని, ముఖ్యంగా అంతేరాలో కీమా బిర్యానీ రుచికి ఫిదా అయ్యానని అన్నారు. మరికొద్ది రోజుల్లో స్వయంభు సినిమాతో రాబోతున్నానని తెలిపారు. అంతేరా వ్యవస్థాపక భాగస్వామి ఆశిష్ రెడ్డి మాట్లాడుతూ మూడు ప్రాంతాల గొప్ప వారసత్వాన్ని, ఆధునిక ఆహార ప్రియులు కోరుకునే వినూత్న రుచుల మేళవింపుతో సరికొత్త రుచులను అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో అంతేరా భాగస్వామ్యులు అనురాగ్ రెడ్డి, అనూహ్య రెడ్డి, మృణాల్ తదితరులు పాల్గొన్నారు.



అంతేరా రెస్టారెంట్‌ను ప్రారంభించిన సినీ నటుడు నిఖిల్ సిద్దార్థ

హెచ్‌సీయూలో ఆంత్రోపాలజీ పోస్ట్ కాంగ్రెస్ సదస్సు

రాయదుర్గం: ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ ఆంత్రోపాలజీ అండ్ ఎత్నోలాజికల్ సైన్సెస్ (ఐయూఈఏఎస్) వారి 19వ వరల్డ్ ఆంత్రోపాలజీ పోస్ట్ కాంగ్రెస్ సదస్సు రెండు రోజులపాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. హెచ్‌సీయూ ఆంత్రోపాలజీ విభాగం గురు, శుక్రవారాల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనుంది. ఈ సదస్సు 'ఆంత్రోపాలజీ అండ్ డిజిటల్ కల్చర్స్' అనే అంశంపై జరగనుంది. ఈ సదస్సులో 25 ప్యానెళ్లు, అలాగే 100కు పైగా కార్యకర్తలు, ప్లానర్లు, కన్సల్టెంటులు, విద్యావేత్తలు పాల్గొంటారు.

29న ఉచిత వైద్య శిబిరం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీ అపార్టుమెంట్ అసోసియేషన్ కార్యాలయంలో 29వ తేదీ ఆదివారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు అసోసియేషన్ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం ప్రసాద్ హాస్పిటల్ వైద్యులచే నిర్వహించనున్నారు. ఈ శిబిరంలో గైనకాలజీ, జనరల్ వైద్య పరీక్షలు, ఆర్థో, ఈఎన్‌టి, కార్డియాలజీ తదితర సమస్యలకు ఉచిత వైద్యం అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతవాసులు వినియోగించుకోవాలని కోరారు.

అమ్మవారి చీర రూ.80 వేలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని మల్లికార్జుననగర్ కాలనీలో దుర్గాభవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అమ్మవారి చీరను వేలం వేయగా పవన్‌కుమార్ రూ.80 వేలకు దక్కించుకున్నారు. అమ్మవారి నోట్ల దండను రాజ సూర్యప్రభ రూ.75 వేలకు దక్కించుకున్నారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

పటాన్‌చెరు టౌన్: భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు చేసింది. పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ భీమ్‌రావు కథనం ప్రకారం ... ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ప్రభుదాస్(35) బతుకుతెరువు కోసం ఇంద్రేశం వచ్చి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.ఈ క్రమంలో ఈనెల 19వ తేదీన తన కుమారుడితో గొడవపడి ఇంటి నుండి బయటకు వెళ్లిన ప్రభుదాస్ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో భార్య మేరీదేవి భర్త కోసం స్థానికంగా తెలిసిన వారి వద్ద వెతికిన ఆచూకీ లభించలేదు. భర్త అదృశ్యంపై భార్య మేరీదేవి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

- అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులురెడ్డి

పటాన్‌చెరు టౌన్: బెల్ట్ షాపులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అమీన్‌పూర్ సీఐ శ్రీనివాసులు రెడ్డి అన్నారు. మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో బిహార్ నుండి బతుకుదెరువు కోసం వచ్చిన అరవింద్ కుమార్ హోటల్‌లో మద్యం విక్రయిస్తున్నాడని బుధవారం సమాచారం రావడంతో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.10 వేలు విలువ చేసే మద్యం స్వాధీనం చేసుకుని, విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



శిల్పా ఎన్‌క్లేవ్ పార్కులో పునాస మామిడి మొక్కను నాటిన వెంకటేశ్వర్లు, విశ్రాంత ఉద్యోగులు

కూకట్‌పల్లి: విజయదశమి పండుగను పురస్కరించుకొని శిల్పా ఎన్‌క్లేవ్ పార్కులో బుధవారం విశ్రాంతి ఉద్యోగులు పునాస మామిడి మొక్కను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత సంవత్సరం కూడా విజయదశమికి పార్కులో, లక్ష్మీ గణపతి ఆలయంలోని పార్కులో పవిత్రమైన జమ్మి మొక్కలను నాటామన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిసిటి ఎంప్లాయిస్ యూనియన్327 స్టేట్‌వైస్ ప్రెసిడెంట్ కె. వెంకటేశ్వర్లు, ఎస్. రమేష్, ఆర్. శ్రీనివాస్‌రెడ్డి, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

కళలతో చిన్నారుల్లో సృజనాత్మకత

పంజగుట్ట: చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కళలు ఎంతో దోహదం చేస్తాయని ప్రముఖ విజువల్ ఆర్ట్స్ ఉపాధ్యాయురాలు, సినీ నటి గీతా భాస్కర్ అన్నారు. పాఠశాలల్లో 40 నిమిషాలు డ్రాయింగ్ క్లాస్ ఉంటుందని కాని దాన్ని సక్రమంగా వినియోగించుకోవడంలేదని అభిప్రాయపడ్డారు. టెంపర్‌వేరీ బుక్స్ ఇచ్చి పాత బొమ్మలు చూపుతూ వాటినే తిరిగి వెయ్యమంటున్నారని, అలా కాకుండా పిల్లల్లో క్రియేటివిటీ పెంచేందుకు ప్రయత్నించాలన్నారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... డ్రాయింగ్‌తో అన్ని రకాల సబ్జెక్టులు బోధించవచ్చునని పిల్లలకు మరింత మెదడుకు ఎక్కే అవకాశం ఉంటుందన్నారు. ఇండియన్ ఫైన్ ఆర్ట్ అండ్ మిడియా ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా ప్రత్యేక కోర్సును ప్రారంభించినట్లు దీనితో విద్యార్థుల్లో అంతర్లీనంగా సృజనాత్మకత వెలికితీయడంలో ఎంతో దోహదపడుతుందన్నారు. ఇప్పటికే నగరంలో పలు పాఠశాలల్లో ఈ కోర్సు విజయవంతంగా సాగుతుందని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సద్వినియోగం చేసుకుంటే అద్భుతాలు సాధించవచ్చునని తెలిపారు.



ఆర్ట్ ద్వారా ఎలా సృజనాత్మకతను పెంచుకోవచ్చో చూపుతున్న గీతా భాస్కర్

భరతనాట్య ప్రదర్శన



మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న ఆలిండియా శారీమేళా ముగింపు కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీ నారాయణి నాట్యాలయ గురువు సంతోష్‌కుమార్ తమాంగ్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. ఇందులో పుష్పాంజలి, అలరిపు, గణేశ కౌతం, జతిస్వరం, శబ్దం, దశావతారం, శబ్దం, కీర్తనం, కృతి, తిల్లాన, మంగళం తదితర అంశాలను ప్రదర్శించి అలరించారు. కళాకారులు అంకిత, పద్మ, భవ్య, హర్షిత, పియూసి, శరణ్య, రుచిత, వృందా, ఐశ్వర్య, సహస్ర, సిరిచందన, మిశ్క, పార్వతీ, జనని, సోమ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆత్మీయ సమావేశాలు

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హుడా కాలనీ, జనప్రియనగర్‌లలో బుధవారం ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఎమ్మెల్యే గాంధీని గెలిపించుకుంటామన్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ నియోజకవర్గాన్ని రూ.9వేల కోట్లతో అభివృద్ధి చేశానన్నారు. కార్యక్రమంలో డివిజన్ గౌరవ అధ్యక్షులు హరీష్ రావు, గౌతమ్‌గౌడ్, మనోహర్ గౌడ్, లక్ష్మారెడ్డి, చంద్రశేఖర్ ప్రసాద్, దాత్రిగౌడ్, ఉరిటి వెంకట్రావు, మిద్దెల మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

కాంగ్రెస్ నాయకుల వినతి

పటాన్‌చెరు టౌన్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మహిపాల్ రెడ్డి బతుకమ్మ సంబరాల పేరిట లక్షలాది రూపాయల ఖర్చు చేశారని దీనిపై విచారణ చేపట్టాలని ఐఎన్‌టియూసీ జిల్లా అధ్యక్షుడు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణంలోని సాకి చెరువు వద్ద, రామచంద్రాపురంలో బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన నాయకుల ఫొటోలతో కూడిన విద్యుత్ తెరలను ఏర్పాటు చేసినా అధికారులు ఎందుకు స్పందించడం లేదన్నారు. తక్షణమే విచారణ చేపట్టాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు హబీబ్ జానీ, జిల్లా కన్వీనర్ వాజిద్, నాయకులు కిషన్, పట్టణ కాంగ్రెస్ నాయకులు రామారావ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఊరేగింపు.. ఆటపాటలు.. నిమజ్జనం





లింగంపల్లి, తారానగర్‌లో కోలాహలంగా సాగుతున్న అమ్మవారి ఊరేగింపు

శేరిలింగంపల్లి: 'జై మాత.. జైజైమాత'. నినాదాలు, అమ్మవారిని కొలుస్తూ ఆటాపాటలతో లింగంపల్లి, తారానగర్ రోడ్లు కోలాహలంగా మారాయి. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతిష్ఠించిన అమ్మవారిని నిమజ్జనం చేయడానికి తీసుకెళ్ళే మార్గంలో సందడి నెలకొంది. పలురకాల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భారీఎత్తున ఊరేగింపులు సాగుతుండడంతో లింగంపల్లి, తారానగర్ రోడ్లలో ట్రాఫిక్‌ను మార్కెట్, ఫ్లైఓవర్ మీదుగా మళ్ళించారు.

